7
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



డ్రోన్ల ట్రయల్ రన్!
రైతుకు పెట్టుబడి భారాన్ని తగ్గించే డ్రోన్లను రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందజేసి ప్రోత్సహిస్తోంది. 8లో



ఉల్లాసంగా క్రీడా పోటీలు
జిల్లాలోని మండల కేంద్రాల్లో క్రీడా పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతున్నాయి. 8లో



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
జి.మాడుగుల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వ్యాచరచన పోటీలకు విశేష స్పందన లభించింది. 8లో

న్యూస్‌రీల్

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి నిందితులతో ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: మండలంలో గంజాయి సాగు చేస్తున్న రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామానికి చెందిన పాంగి సీతారాం (53), పాంగి త్రినాథ్(25)ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామంలో పది సెంట్ల విస్తీర్ణంలో 50 గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్టుగా గుర్తించామని చెప్పారు. సిబ్బందితో తనిఖీలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. గంజాయి సాగు చట్టరీత్యా నేరమని, గంజాయి సాగు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న దేవీపట్నం ఎస్ఐ నాగార్జున

దేవీపట్నం: మండలంలోని గోకవరం- దండంగి ఆర్అండ్‌బీ రహదారిలో పరగసానిపాడు కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగార్జున మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

ముంచంగిపుట్టు: పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ మొండికోట గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌పై దాడి చేసిన పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సెల్ టవర్‌కు స్థలం ఇవ్వకపోతే దాడి చేయడం, సాగు భూమిపై ఆధారపడి జీవించే గిరిజనుడి పట్ల ఎస్ఐ దారుణంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. ఈ సంఘటనపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే బాధితుడి పక్షాన ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. దీనిపై పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను వివరణగా సెల్ టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని కోరామన్నారు. అతనిపై దాడి చేసినట్టు ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదని ఎస్ఐ వివరించారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోతున్న పూరిల్లు

ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి తునికిగుట్ట గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. గుగులోత్ వీరమ్మ ఇంట్లో లేని సమయంలో మంటలు వ్యాపించడంతో కాలిపోయింది. దీంతో ఇంట్లోని నిత్యావసరాలు, దుస్తులు కాలిబూడిదయ్యాయి.

మారేడుబాక ఉప సర్పంచ్ మృతి



లక్ష్మి (ఫైల్)

రాజవొమ్మంగి: వైఎస్సార్ సీపీకి చెందిన మండలంలోని మారేడుబాక ఉపసర్పంచ్ ముర్ల లక్ష్మి (38) ఆదివారం మృతి చెందారు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమె కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీకి వెళ్లింది. జ్వరం అదుపులోకి రాకపోవడంతో వెంటనే వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉర్లాకులపాడులో ఉంటున్న ఈమెకు భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మార్కెట్‌కు చవితి శోభ

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు మార్కెట్లో చవితి సందడి నెలకొంది. పాతబస్టాండు, సినిమాహాల్ సెంటర్, కాంప్లెక్సు రోడ్డు, మెయిన్ రోడ్డు, స్టేట్ బ్యాంక్ ఏరియా, శ్రీనివాస లాడ్జి, మసీదు సెంటర్లలో అన్ని దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం నుంచి భారీస్థాయిలో వ్యాపారం జరిగింది. వినాయక విగ్రహాలను ఉత్సవ నిర్వాహకులు కొనుగోలు చేసి వాహనాల్లో మండపాలకు తరలించారు. ఇళ్ల వద్ద పూజ చేసుకునేందుకు అవసరమైన గణనాథుని ప్రతిమలు, పూజా సామగ్రిని పట్టణ ప్రజలు కొనుగోలు చేశారు. కిరాణా దుకాణాలు రద్దీగా కనిపించాయి. చవితి నేపథ్యంలో పూలు, పండ్ల ధరలు పెరిగాయి. మట్టి విగ్రహాల అమ్మకాలు భారీగానే జరిగాయి. స్థానికంగా చవితి ఉత్సవాలకు సంబంధించి మండపాల ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది భారీస్థాయిలో జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు.



వినాయక చవితి సామగ్రి కొనుగోలుతో రద్దీగా పాడేరు పట్టణంలోని ప్రధానరోడ్డు

వినాయక చవితి శుభాకాంక్షలు

సాక్షి,పాడేరు: జిల్లా ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్,పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.అలాగే అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి ప్రజలకు చవితి శుభాకాంక్షలు తెలిపారు.



వాహనాల్లో గణనాథుని విగ్రహాల తరలింపు



పాడేరులో మట్టి ప్రతిమల కొనుగోళ్లు



పాడేరులో పూల దుకాణం వద్ద అమ్మకాలు

మట్టి ప్రతిమలను పూజించండి



గణనాథుల మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,ఆలయ కమిటీ ప్రతినిధులు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- ఉచితంగా గణపతి విగ్రహాల పంపిణీ

సాక్షి,పాడేరు: మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రసాయనాలతో తయారుచేసే విగ్రహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ,పర్యావరణ పరిరక్షణ, నీటికాలుష్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. వినాయకచవితి పండగను భక్తులు ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆమె కోరారు. గణనాథుని విగ్రహాల నిమజ్జన సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. పోలీసుశాఖ సూచనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె కోరారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, స్థానిక జీజేసీ ప్రిన్సిపాల్ సీహెచ్.రమాదేవి,ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం, ఆధ్యాత్మిక కమిటీ,మోదమణికంఠ అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు వుప్పల వెంకటరత్నం, లకే నానిపాత్రుడు,కారం దేముడు, బొడ్డు ముకుందరావు,శివరాత్రి శ్రీను, పలాసి బాలన్న, సిద్దనాతి కొండలరావు, కిషోర్, అల్లాడ నగేష్ పాల్గొన్నారు.

30 నుంచి ఏయూ తరగతులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బీటెక్, బీఆర్క్, ఎంటెక్, ఎంఆర్క్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం తరగతులు ఈ నెల 30న ప్రారంభించనున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులనుద్దేశించి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం తరగతులను లాంఛనంగా ప్రారంభిస్తారు. 2023–24లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు కన్వెన్షన్ సెంటర్‌కి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు సూచించారు. విద్యార్థులు ఈ నెల 29న తమ విభాగంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. విద్యార్థులు ఈ నెల 28 నుంచి హాస్టల్స్‌లో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

రక్తదాన శిబిరాలు ప్రారంభం

- వచ్చేనెల 2 వరకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ



శిబిరం నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలను ఆదివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రారంభించింది. స్థానిక జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ యూనిట్‌లో పలువురు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. వచ్చేనెల రెండవ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని, దాతలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని డాక్టర్ రూపకళ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాసుడు, సూర్యారావు కోరారు.

మినీ వ్యాన్ బోల్తా

ఇద్దరికి తీవ్రంగా, ఆరుగురికి స్వల్పంగా గాయాలు

రంపచోడవరం: మండలంలోని బాపనమ్మ తల్లి దర్శనానికి వచ్చిన భక్తుల మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురికి స్వల్పంగా, ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన 20 మంది వ్యాన్‌లో ఆదివారం సీతపల్లిలోని బాపనమ్మ గుడికి వచ్చారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం రంప జలపాతం చూసేందుకు మినీ వ్యాన్‌లో బయలుదేరారు. ఐ పోలవరం జంక్షన్ సమీపంలోని మలుపు వద్దకు వచ్చేసరికి వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జింకల శివ, పురందాసు కొండయ్యకు తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. మిలిగిన వారు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందారు.





రంపచోడవరం ఆస్పత్రిలో క్షతగాత్రులు

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం



చింతూరు, భద్రాచలం రహదారిలో వాహనాలు వెళ్లకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసులు



ఎటపాక మండలంలో మావోయిస్టుల పేరుతో వెలసిన పోస్టర్లు

రాత్రిపూట వాహన రాకపోకలను నిలిపివేస్తున్న పోలీసులు

చింతూరు: మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు చింతూరు, భద్రాచలం నడుమ రాత్రిపూట వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశాల నుంచి వయా చింతూరు, ఏడుగురాళ్లపల్లి మీదుగా వాహనాలు తెలంగాణకు ప్రయాణిస్తుంటాయి. ఈనెల 21 నుంచి 27 వరకు మావోయిస్టులు వార్షిక వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు భద్రాచలం వైపునకు వెళ్లే వాహనాలను మండలంలోని కూనవరం జంక్షన్ నుంచి కూనవరం మండలం భీమవరం మీదుగా మళ్లిస్తున్నారు. రాత్రి 8 గంటల అనంతరం ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను చింతూరు మండలం చట్టి జంక్షన్ వద్ద నిలిపివేస్తున్నారు. ఉదయం 6 గంటల తరువాత పంపిస్తున్నారు.

మావోయిస్టుల పేరిట పోస్టర్లు

ఎటపాక: మండలంలోని గన్నవరం, నందిగామ, కూనవరం ప్రధాన రహదారి,లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారి ప్రాంతాల్లో ఆదివారం మావోయిస్టుల పేరిట పోస్టర్లు వెలిశాయి. సీపీఐ మావోయిస్టు పార్టీ 19వ వార్షికోత్సవాలను దృఢ సంకల్పంతో జరుపుకుందామని పేర్కొంటూ సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ, చర్ల, శబరి ఏరియా కమిటీ పేరుతో వెలిశాయి. దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు మైదాన, పట్టణ ఉద్యమాలను పెంపొందిద్దామని, బూటకపు న్యూ ఇండియా కాదు నూతన ప్రజాస్వామిక ఇండియా కావాలంటూ పోస్టర్లలో పేర్కొన్నారు. పోలీసులు వెంటనే వీటిని తొలగించారు.

నిత్యావసర సరకుల పంపిణీలో జాప్యం తగదు

సీలేరు: జీసీసీ డిపోల ద్వారా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలకు అందిస్తున్న నిత్యావసర సరకుల పంపిణీలో ఎలాంటి జాప్యం చేయవద్దని జాతీయ ఆహార రక్షణ చట్టం పర్యవేక్షణ బృందం ఆదేశించింది. ఆదివారం స్థానిక జీసీసీ డిపోను బృందం సభ్యులు తనిఖీ చేశారు. జిల్లాలో రంపచోడవరం, పాడేరు డివిజన్లలో రేషన్ పంపిణీ తీరును పరిశీలిస్తున్నట్టు వారు తెలిపారు. ఏమైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్డుదారుల ఫిర్యాదు

సీలేరు జీసీసీ డిపో ద్వారా పేదలకు బియ్యం పంపిణీలో అవకతవకలు ఉన్నాయని కేంద్ర బృందానికి కార్డుదారులు ఫిర్యాదు చేశారు. ప్రతి నెలా ప్రభుత్వాల నుంచి అందుతున్న సరుకుల్లో కోత విధిస్తున్నారని, సేల్స్‌మెన్ స్థానికంగా ఉండటం లేదని వివరించారు. ఇదేమని ప్రశ్నిస్తే మండలం నుంచి వస్తున్న రేషన్ గోదాము సరుకుల్లోనే కోత ఉందని, అలాగే తమకు ఇచ్చే సరుకుల్లోనూ కోత విధిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర బృందం సభ్యులు వివరాలు నమోదు చేసుకున్నారు. బియ్యం అందకపోవడానికి గల కారణాలను రేషన్ కార్డు దారులను విచారించి తమకు నివేదించాలని సర్పంచ్ దుర్జు, ఉపసర్పంచ్ వల్లి ప్రసాద్ బృందం సభ్యులు సూచించారు. బృందంలో ఏఎస్ఏ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఉపేంద్ర సింగ్, సూపర్‌వైజర్ డాక్టర్ ఠాగూర్ అవతార్ సింగ్, విచారణ గ్రేడింగ్ అధికారి సయుద్దీన్, డివిజనల్ ఏఎస్‌వో శ్రీహరి ఉన్నారు.



సీలేరు జీసీసీ డిపోను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మృతి

- కలువ పూలు సేకరిస్తుండగా ప్రమాదం
- రాజవొమ్మంగి గ్రామంలో విషాదఛాయలు

రాజవొమ్మంగి: పొట్టకూటి కోసం చెరువులో కలువ పూలు సేకరిస్తుండగా ప్రమాదవశాత్తూ ఊబిలో కూరుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలావున్నాయి. స్థానిక షిర్డీ సాయి నగర్‌కు చెందిన భీమిలి రమణ (45) ఆదివారం కలువ పూలు సేకరించేందుకు మండలంలోని శరభవరం పంచాయతీ వణకరాయి గ్రామ సమీపాన చెరువు వద్దకు వెళ్లాడు. చవిత పూజకు విక్రయాల నిమిత్తం అక్కడ కలువ పూలు సేకరిస్తుండగా కాలుజారి చెరువులో పడిపోయాడు. ఊబిలో కూరుకుపోయిన అతనిని అక్కడ ఉన్న యువకులు అతికష్టమ్మీద బయటకు తీశారు. కొనఊపిరితో ఉన్న అతనిని అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో చనిపోయినట్టు సీఐ గోపీరేంద్రప్రసాద్ తెలిపారు . పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతునికి భార్య, ఇరువురి సంతానం. గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.



రమణ మృతదేహం

నిబంధనలు పాటిద్దాం



మాట్లాడుతున్న జీపు,మోటార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్ని



హాజరైన ప్రయివేటు వాహన ఆపరేటర్లు, డ్రైవర్లు

జీపు, మోటార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్ని

పాడేరు రూరల్ : ప్రైవేటు వాహన ఆపరేటర్లు తప్పకుండా నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని జీపు, మోటార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లొట్టి చిన్ని సూచించారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని దుర్గ గుడి ఎదురుగా జిల్లా జీపు, మోటార్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఇటీవల ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాడేరు ఏఎస్పీ కె. ధీరజ్ మోటార్ యూనియన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఈ అంశాలపై ఆదివారం జరిగిన సమావేశంలో చర్చించారు. జీపు, మోటార్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్నీ మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం ధరించాలని కోరారు. విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్సు కాలపరిమితి ఉండేలా చూసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం జీపులో కేవలం 12 మంది ప్రయాణికులను మాత్రమే ఎక్కించాలన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రతిరోజు వాహనం యొక్క ఫిట్‌నెస్‌ను పరిశీలించుకోవాని అధికారులు సూచించారని ఆయన తెలిపారు. పోలీసుల ఆదేశాలను ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని కోరారు. ప్రయివేటు వాహన ఆపరేటర్లు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్ నిరంతరం తమ పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ యూనియన్ నాయకులు మోహన్, సురేష్, అప్పారావు, వెంకట్, నాగరాజు, నాయుడు, గోవింద, తిరుమల నాయుడు, రవి, రామరావు, బలరాం, పెంటారావు, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు బ్రహ్మోత్సవ శోభ

మాడ వీధుల్లో ఉత్సవ కావడి ఊరేగింపు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం ఈ ఉత్సవాలను నిర్వ హించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం అంకురార్పణ నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా మాడ వీధుల్లో ఉత్సవ కావడిని ఊరేగించారు. గరుడాద్రిపై కల్కిఅవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, నిత్యపూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పసుపు కొమ్ములు, కుంకుమ, కొబ్బరి బొండాలు, కానుకలు సమర్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు, సుదర్శన పెరుమాళ్లకు, ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, పీసపాటి శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వప్న తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలు అలంకరించారు. క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణలో భాగంగా ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, రక్షాబంధనం, అంతరాలయ పూజలతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలోఉంచి గ్రామంలో ఉత్తర ఈశాన్యదిక్కున ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి మత్స్యసంగ్రహణ(పుట్టమన్ను) తెచ్చే కార్యక్రమం నిర్వహించారు. తాత్కాలిక యాగశాల వద్ద అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, చతుష్టాన అర్చనలు పూర్తిచేసి గరుడ అవాహన, గరుడ అప్పాల నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 18నుంచి 26వరకు జరుగుతాయి. 18న సోమవారం ధ్వజారోహణం, 23న వసంతోత్సవం, 25న మృగవేట, 26న పూర్ణాహుతి, వినోదోత్సవం, కంకణ విసర్జన, చూర్ణోత్సవం, ఆవభృందస్నానం వంటి కార్యక్రమాలు జరుగుతాయని అర్చక స్వాములు తెలిపారు.



స్వామివారి ఉత్సవ కావడిని మాడ వీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు



నూతన వస్త్రాలంకరణలో స్వామివారి ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాల్లో దర్శనంతో విశేషఫలితం

కల్కి వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం వల్ల ఎన్నో విశేష ఫలితాలు లభిస్తాయని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామిని దర్శించుకోవడం వల్ల గ్రహదోషాలు తొలగిపోయి, ఈతిబాధలనుంచి విముక్తికలుగుతుందని చెప్పారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో సీనియర్ న్యాయవాదులు

డాబాగార్డెన్స్ : తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాదులు పబ్బ రమేష్, కమ్మరి వెంకటాచారి మార్కండేయరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తడక జగదీశ్వర్ గుప్తా ఆదివారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వీరిచే వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న సీనియర్ న్యాయవాదులు

క్లుప్తంగా

కుస్తీ పోటీల్లో పాములవాక విద్యార్థి సత్తా



కుస్తీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థి గణేష్‌తో పీడీ అచ్యుతరావు

కోటవురట్ల: కుస్తీ పోటీల్లో పాములవాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కన్నూరు గణేష్ సత్తా చూపి, గోల్డ్ మెడల్ సాధించాడు. కొయ్యూరు కుస్తీ అకాడమీలో జరిగిన కుస్తీ పోటీల్లో అండర్ 14 విభాగంలోని 62 కిలోల కేటగిరీలో ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. గణేష్‌ను హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, సర్పంచ్ సత్యవతి. కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన జేసీఐ వీక్ జైత్ర



పృథ్వీరాజ్‌కు సేవా పురస్కారాన్ని అందిసున్న జేసీఐ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: జూనియన్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న 'వీక్ జైత్ర' ఆదివారంతో ముగిసింది. జేసీఐలోని వివిధ విభాగాల ప్రతినిధులు వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. వేలాది మందికి పరీక్షలు నిర్వహించిన వీ డెంటల్ ఆస్పత్రిని ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేశారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో ఆస్పత్రి మేనేజర్ కె.పృథ్వీరాజ్‌కు ఈ అవార్డును ప్రదానం చేసి.. ఘనంగా సత్కరించారు. జేసీఐ వీక్ చైర్‌పర్సన్ ఫణి కల్యాణ్, విశాఖ ఎక్స్‌లెన్స్ చాప్టర్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ప్రతినిధులు రాజేష ఉట్టి, భార్గవ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల ట్రయల్ రన్!

- భీమిలి మండలంలో ప్రయోగాత్మకంగా ప్రదర్శన
- జిల్లాలో నలుగురు పైలట్ల ఎంపిక
- వచ్చే నెలలో అమరావతిలో వీరికి శిక్షణ
- రెండు మూడు నెలల్లో అందుబాటులోకి డ్రోన్లు

సాక్షి, విశాఖపట్నం: రైతుకు పెట్టుబడి భారాన్ని తగ్గించే డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయి. పంటల చీడపీడలను నివారించేందుకు ఇన్నాళ్లూ మనుషులతోనే పురుగుమందులను పిచికారి చేయిస్తున్నారు. దీనివల్ల రైతులకు కూలీ భారం పెరిగిపోవడమే కాదు.. పిచికారీ చేసేవారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇకపై ఆ పనిని డ్రోన్లే చేయనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ డ్రోన్ల కొనుగోలుకు రాయితీ ఇవ్వడమే గాక, వాటిని ఆపరేట్ చేసే పైలట్లకు శిక్షణను కూడా ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రాథమికంగా మండలానికి ఒకటి, అవసరమైతే రెండు చొప్పున డ్రోన్లను మంజూరు చేస్తోంది. ఐదుగురు రైతులతో ఒక గ్రూపు ఏర్పాటైతే వారికి ఒక డ్రోన్‌ను కేటాయిస్తుంది.

వీరిలో ఇంటర్మీడియట్ విద్యార్హత, పాస్‌పోర్టు కలిగిన వ్యక్తికి డ్రోన్ పైలట్‌గా అమరావతిలో 15 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. అక్కడ శిక్షణ పొందిన తర్వాత డ్రోన్ కోనుగోలు చేస్తే ఆ సొమ్ములో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. విశాఖ జిల్లాలో 11 మండలాలకు గాను ఏడు మండలాలు అర్బన్ పరిధిలో ఉన్నాయి. పెందుర్తి, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో మాత్రమే పంటలు సాగవుతున్నాయి. అందువల్ల ఈ నాలుగు మండలాలకు ఆరు డ్రోన్లు మంజూరయ్యాయి. విశాఖ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు గ్రూపులను, పైలట్లను ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటికే పెందుర్తి మండలానికి చెందిన ఎల్.లక్ష్మీనారాయణ అనే పైలట్ అమరావతిలో శిక్షణ కూడా పూర్తి చేసుకుని వచ్చారు. ఈయనతో భీమిలి మండలం తాటితూరులో ఇతర గ్రూపుల సభ్యులకు డ్రోన్‌తో గురువారం ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. పురుగు మందులు, సూక్ష్మ పోషక ఎరువుల పిచికారి విధానంతో పాటు డ్రోన్ టెక్నాలజీపై వీరికి అవగాహన కల్పించారు. దీనిని మరికొద్ది రోజులు కొనసాగిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎ.అప్పలస్వామి 'సాక్షి'కి చెప్పారు. ఎంపిక చేసిన పైలట్లను శిక్షణ కోసం త్వరలో అమరావతి పంపిస్తామన్నారు. మరో రెండు మూడు నెలల్లో జిల్లాలో డ్రోన్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

డ్రోన్లతో ప్రయోజనాలివీ..

ఒక్కో డ్రోను ఖరీదు రూ.6.50 నుంచి 9 లక్షల వరకు ఉంటుంది. ఎంపికైన గ్రూపు సభ్యులు డ్రోన్ కొనుగోలుకు ఈ సొమ్ములో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. డ్రోన్ల వినియోగంతో రైతులకు ఎంతో మేలు జరగనుంది. సాధారణంగా ఒక ఎకరం పొలంలోని వరిపంటకు పురుగు మందు పిచికారి చేయాలంటే 150–200 లీటర్ల మందు కలిపిన నీరు అవసరమవుతుంది. స్ప్రే చేసే కూలీకి 3–4 గంటల సమయం పడుతుంది. అదే 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్‌తో పిచికారి చేయడానికి 15 నిమిషాలు సరిపోతుంది.

దీంతో సమయం ఆదా అవుతుంది. అంతేకాదు అనారోగ్యం బారినపడతామన్న భయంతో పంట చేలకు పురుగు మందులు చల్లడానికి కూలీలు దొరకడం లేదు. దీంతో సాధారణ కూలీకంటే ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. పైగా కూలీల కొరత వల్ల సకాలంలో పిచికారీ చేయలేక పోవడంతో పంట తెగుళ్ల బారిన పడి దెబ్బతింటోంది. ఇప్పుడు ఈ డ్రోన్లు అందుబాటులోకి వస్తే సమయం, సొమ్ము ఆదా అవుతుంది. కూలీల కొరత తీరుతుంది. పైగా ఈ డ్రోన్లతో పురుగు మందులతో పాటు సూక్ష్మ పోషక ఎరువులను కూడా పిచికారి చేసుకునే వీలు కూడా ఉంది. ఇలా డ్రోన్లు రైతులకు ఎంతో ప్రయోజనకారులవుతాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.



వరి పంటపై పురుగు మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

భక్త వరదుడు... ఒడ్డిమెట్ట ఏకదంతుడు

- నేటినుంచి నవరాత్రి ఉత్సవాలు
- జాతరకు వేలాది మంది హాజరు



భక్తులచే పూజలందుకుంటున్న లక్ష్మిగణపతి

నక్కపల్లి: విఘ్నాలు తొలగించే వినాయకుడిగా, భక్త వరదుడుగా, గ్రామీణ జిల్లా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. వినాయకచవితి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. చవితినాడు స్వామిని దర్శించుకునేందుకు అనకాపల్లి, యలమంచలి, నర్సీపట్నం, తుని, అన్నవరం, పాయకరావుపేట, నక్కపల్లి తదితర పట్టణాలనుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారు. ఒడ్డిమెట్ట కైలాసగిరిపై దాదాపు నూర్లేళ్ల క్రితం తాటిచెట్టు మొదలులో లక్ష్మీగణపతి వెలిశాడని పూర్వీకుల కథనం. నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి స్వామి కలలో కనిపించి కైలాసగిరిపై పలానా చోట తాను వెలిశానని చెప్పడంతో అక్కడ తవ్వకాలు జరుపగా విగ్రహం బయటపడింది. జాతీయరహదారికి ఆనుకుని పందిర వేసి విగ్రహాన్ని పెట్టి పూజలు చేయడం ప్రారంభించారు. హుండీలలో, కానుకల రూపంలో లభించిన ఆదాయంతో పాటు విరాళాలు సేకరించి కొండపై ఆలయాన్ని నిర్మించారు. తర్వాత ఈ ఆలయం దేవదాయశాఖ ఆధీనంలోకి వెళ్లింది. వినాయకచవితి నాడు ఇక్కడ పెద్ద తిరునాళ్ల జరుగుతుంది. వేకువ జామునుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించేవారు, కొత్త వాహనాలు కొన్న వారు తొలుత ఇక్కడ విఘ్నేశ్వరుడికి పూజలు చేసిన తర్వాత తమ పనులు ప్రారంభిస్తారు. ఈ ఆలయంలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పని భక్తులు మొక్కుబడి రూపంలో చెల్లించి కానుకలతో నిర్వహించినదే కావడం విశేషం. ఒడ్డిమెట్ట గ్రామస్తులు లక్ష్మీగణపతిని తమ ఇలవేల్పుగా కొలుస్తారు. సంక్రాంతి, ఉగాది తర్వాత అత్యంత ఘనంగా వినాయక చవితిని వారు జరుపుకొంటారు. చవితినాడు బంధువుల రాకతో ఇళ్లన్నీ సందడిగా ఉంటాయి.ప్రతిఇంట్లో గణపతి పేరుతో ఉన్నవారు ఉంటారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...

తొమ్మిదిరోజుల పాటు జరిగే మహోత్సవాలకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్టు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి నరిశే వెంకటాద్రి తెలిపారు. ఉదయం 5గంటలనుంచే స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. 18వ తేదీ సోమవారం సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు.తొమ్మిదిరోజులపాటు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం చివరి రోజున అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులకు సాధారణ దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నామన్నారు.

పోలీసు బందోబస్తు

వినాయకచవితి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది మంది తరలి వస్తారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నక్కపల్లి సీఐ అప్పన్న పర్యవేక్షణలో ఎస్‌ఐ శిరీష విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జాతీయరహదారిని ఆనుకుని ఆలయం ఉండటంతో ట్రాఫిక్‌జాం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. మెట్లమార్గం వరకు వాహనాలను అనుమతించకుండా రోడ్డుపైనేపార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లుచేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. నక్కపల్లి, పాయకరావుపేటలనుంచి పోలీసు సిబ్బందిని రప్పించి బందోబస్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నిధులు, దాతల నుంచి సేకరించిన విరాళాలు రూ.20లక్షల వ్యయంతో ఈఏడాది కొండపైకి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో పాతరోడ్డును ఆనుకుని నిర్మించిన రోడ్డుమార్గం ద్వారా కూడా భక్తులు కొండపైకి చేరుకోవచ్చు.

అందరూ స్వామి సేవకులే...

- టీమ్ వర్క్‌తో ముందుకు వెళ్తా..
- సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ

సింహాచలం: అందరి సహకారంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని, అందరూ స్వామివారి సేవకులేనని భావిస్తానని కొత్త ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం ఈవోగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సింహగిరికి ఉదయం కుటుంబసమేతంగా వచ్చిన ఆయన తొలుత ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆయన బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. గత ఈవో వి.త్రినాథరావు ఆయన్ని సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

అనంతరం శ్రీనివాసమూర్తి మీడియాతో మాట్లాడారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఈవోగా రావడం భగవంతుడు కల్పించిన అదృష్టంగా భావిస్తానన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా టీమ్ వర్క్‌తో ముందుకు వెళ్తామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎంత మంచి దర్శనం అందించగలమన్న విషయంపై ప్రధానంగా దృష్టిసారిస్తానన్నారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. భక్తుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటానన్నారు. ప్రతి నెలా మీడియాతో కూడా సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, దొడ్డి, రమణ, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు ఈవోని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



గత ఈవో త్రినాథరావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

తొలిరోజు అన్ని విభాగాల్లోనూ పర్యటన

ఈవోగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే శ్రీనివాసమూర్తి దేవస్థానంలోని అన్ని విభాగాల్లోను పర్యటించారు. ఆయా విభాగాలను సందర్శించి పాలనా వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో విభాగాధిపతులు, సిబ్బందితో మాట్లాడారు. అన్నప్రసాద భవనాన్ని సందర్శించి డైనింగ్ హాల్, కిచెన్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. వేద పాఠశాలను సందర్శించి వేద విద్యార్థులతో మాట్లాడారు. దేవస్థానం ఏఈవో రమణమూర్తి, ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రూ.1.83 కోట్లతో బొజ్జన్నకొండపై అభివృద్ధి పనులు



డిజైన్‌ను పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: జిల్లాలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రం, చారిత్రకంగా గుర్తింపు పొందిన మండలంలో శంకరం వద్ద గల బొజ్జన్న కొండను అభివృద్ధి చేయనున్నామని ఎంపీ బి.వి.సత్యవతి తెలిపారు. టూరిజంశాఖ అధికారులతో కలిసి బొజ్జన్నకొండను, డిజైన్‌ను ఆమె ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.1.83 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఈనెల 24న ప్రారంభించనున్నట్టు చెప్పారు. పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా డిజైన్‌లో పలు మార్పులను అధికారులకు సూచించారు. టూరిజంశాఖ ఏఈ రాము, డీఈ స్వామి, ఏఈ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గొంప



అచ్యుతాపురం(అనకాపల్లి): ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అచ్యుతాపురం మండలం నునపర్తికి చెందిన గొంప నర్సింహనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని ద్వారకానగర్‌లో గల సెంట్రల్ లైబ్రరీ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన మండలాల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. నునపర్తి గ్రామంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణ,శిక్షణ ఇప్పించడంలో గొంప నర్సింహనాయుడు చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఎస్.రాయవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో హాకీ క్రీడాకారుల ఎంపిక నక్కపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సెలక్షన్స్‌లో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న ఎ.భార్గవి, కె.కావ్యలు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.

ఐక్యరాజ్య సమితి వేదికపై ఎటపాక విద్యార్థిని



ఐక్యరాజ్య సమితి వేదికలో ఏపీ విద్యార్థులతో చంద్రలేఖ

ఎటపాక : ఐక్యరాజ్య సమితి వేదికగా న్యూయార్క్‌లో జరుగుతున్న ఎస్‌డీజీ యాక్షన్ వీకెండ్ సదస్సులో ఎటపాక విద్యార్థిని మోతుకూరి చంద్రలేఖ పాల్గొంది. స్థానిక కేజీబీవీ పాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జగనన్న ఆణిముత్యాల పథకానికి ఆమె ఎంపికవడం తెలిసిందే. ఐక్యరాజ్య సమితి వేదికలో పాల్గొనేందుకు ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్ష, ఇంటర్వ్యూల్లో రాష్ట్రంలోని కేజీబీవీల నుంచి చంద్రలేఖ అర్హత సాధించింది. ఈ మేరకు యూఎన్‌వో సదస్సులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. మన రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసి విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి దక్కుతుందని పలువురు కొనియాడుతున్నారు. దేశ విదేశాల్లో మన ప్రభుత్వ ఘనత మార్మోగుతోంది. మన రాష్ట్రం నుంచి చంద్రలేఖతో పాటు మరో ఐదుగురు విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. మన రాష్ట్ర విద్యా వ్యవస్థలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను అక్కడ సదస్సులో విద్యార్థులు వివరించనున్నారు. ఎటపాక నుంచి చంద్రలేఖ ఈ సదస్సుకు హాజరుకావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

ఉల్లాసంగా క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదబయలు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, సతీష్, కృష్ణమూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్- 14, అండర్-17 విభాగాల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

మండలంలోని 13 గిరిజన గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలూర పాఠశాలలు, గురుకుల, జిల్లా పరిషత్, ఏకలవ్య పాఠశాలలు, ఆరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు, కేజీబీవీ, ఏకలవ్య పాఠశాలల నుంచి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 315 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వారు చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో సత్తాచాటితే భవిష్యత్తులో మంచి స్థాయి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కో-ఆర్డినేటర్లు రాంనాయుడు, బి.కోటేశ్వరరావు, పీడీలు గోపాల్ నాయుడు, సాధూరాం, రాంబాబు, రామారావు, భీమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జి.మాడుగుల: మండల స్థాయి వ్యాసరచన పోటీలు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీమత్స్య మాడుగులమ్మ ఆలయ ఆధ్వర్యంలో జరిగాయి. ఎస్‌ఐ శ్రీనివాస్ వ్యాసరచన పోటీలను ప్రారంభించి అభ్యర్థులకు తగిన సూచనలు ఇచ్చారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి పంటలకు దూరంగా ఉండాలని ఆయన తెలియజేశారు. సమాజంలో జరుగుతున్న వివిధ రకాలు అంశాలపై అవగాహన ఉండాలన్నారు. యువతలో సామాజిక బాధ్యత కోసం మత్స్యమాడుగులమ్మ యూత్ వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయటంపై ఆయన అభినందించారు. వ్యాసరచన పోటీలకు 156మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 20న నగదు, షీల్డ్ బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, డాక్టర్ ఎం.సౌజన్యదేవి, లక్ష్మణ్, ఎం.శ్రీనివాసరాజు, సాలభం సత్యనారాయణ ఆర్థిక సహాయం చేశారు. మత్స్య మాడుగులమ్మ యూత్ నాయకులు, నిర్వాహకులు ప్రసాద్, జయసింహరాజు, రామకృష్ణంరాజు, ప్రదీప్‌చంద్, గోపాల్‌రాజు, అఖిల్,వలసయ్య, శరత్‌కుమార్, చిన్నరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సర్వం సిద్ధం

గణపతి నవరాత్రులకు ముస్తాబైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడు



వినాయకుడి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ



స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం

చోడవరం: ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం చవితి నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి సందర్భంగా ఆలయం భక్తులతో మరింత రద్దీగా మారనుంది. వీరు వేలాదిగా తరలి రానున్న దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయం లోపల పూర్తిగా పూలతో అలంకరణ చేశారు. ఇటీవల నూతనంగా నిర్మించిన తూర్పు రాజగోపురం ద్వారా మొదటి సారిగా స్వామివారి ఆలయంలోకి భక్తులు ప్రవేశించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తెల్లవారి స్వామివారి ప్రత్యేక పూజతో ప్రారంభమయ్యే చవితి పూజలు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్ని రోజులూ జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకట్రావు, కొడమంచిలి చలపతిరావుల ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మరో పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న పీఎస్‌పేట లక్ష్మీగణపతి ఆలయంలో చవితి, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయం నిర్మించి 132 ఏళ్ల పూర్తికావడంతో ఈ ఏడాది ఉత్సవాలు మరింత వైభవంగా జరిపేందుకు ఆలయ కమిటీ చైర్మన్ పుల్లేటి శ్యామ్‌సుందర్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఈ రెండు ఆలయాల్లో గణేష్ దీక్ష మాలధారణ చేసిన భక్తులతో ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చవితి రోజుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.